సాక్షి
కుమురంభీం
బుధవారం, 19, మార్చి, 2025



కర్బూజ సాగు..లాభాలు బాగు
కొందరు రైతులు వేసవిలో కర్బూజ సాగుపై దృష్టి సారించారు. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 70 ఎకరాల్లో కర్బూజ పంట సాగవుతోంది. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ : 6:23	గురు : 5:04

గరిష్ఠం/కనిష్ఠం
37.8 /23.8

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. ఎండ తీవ్రత కొనసాగుతుంది. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. అర్ధరాత్రి తర్వాత చల్లగా ఉంటుంది.

భట్టి పద్దుపై ఆశలు!



- జిల్లాలో అసంపూర్తిగా సాగునీటి ప్రాజెక్టులు
- వంతెనలు లేక రాకపోకలకు అవస్థలు
- ఏళ్లు గడుస్తున్నా మెరుగుపడని వైద్యం
- నిధుల కేటాయింపుపైనే ప్రజల ఆశలు
- నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థికశాఖ మంత్రి

ప్రజలకు అభివృద్ధి ఫలాలు కాస్త చేరువైనా.. అనుకున్న రీతిలో మౌలిక వసతులు మెరుగు పడలేదు. జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు సరిపడా నిధులు విడుదల చేయకపోవడంతో యాసంగికి నీళ్లందక పంట పొలాలు బీళ్లుగా మిగులుతున్నాయి. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ వంటి కాలేజీలు లేక స్థానిక విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరమవుతున్నారు. ఇటీవల ఆసిఫాబాద్ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల మంజూరైనా.. సిర్పూర్ నియోజకవర్గానికి కేటాయించలేదు. దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతంగా గుర్తింపు పొందిన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని జిల్లావాసులు కోరుతున్నారు.

ఆసిఫాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క శాసన సభలో బుధవారం బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. జిల్లా ప్రజలు కాంగ్రెస్ సర్కారు బడ్జెట్‌పై భారీ ఆశలు పెట్టుకున్నారు. గతేడాది ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రభుత్వం ఆరు గ్యారంటీలకే ప్రాధాన్యతనిచ్చింది. ముఖ్యంగా రహదారులు, విద్య, వైద్యం, సాగునీటి ప్రాజెక్టులకు ఆశించిన నిధులు కేటాయించకపోవడంపై జిల్లా ప్రజలు, రైతులు అసంతృప్తితో ఉన్నారు.

రాకపోకలకు తంటాలు

గతేడాది జిల్లాలోని 76 చోట్ల ప్రధాన వంతెనల నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం నుంచి ఒక్కపైసా మంజూరు కాలేదు. రహదారుల పరిస్థితి కూడా అధ్వానంగా మారింది. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్లపై గుంతలు పడ్డాయి. వర్షాకాలంలో మరీ అధ్వానంగా మారి రాకపోకలకు ప్రజలు తంటాలు పడుతున్నారు. జిల్లాలో సుమారు 400కు పైగా గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. జిల్లా కేంద్రానికి కేవలం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండి బ్రిడ్జి నిర్మాణం ముందుకు సాగడం లేదు. 15 ఏళ్లుగా పిల్లర్ల దశలోనే మగ్గుతోంది. రూ.2.5 కోట్లతో ప్రారంభమైన అంచనా వ్యయం ప్రస్తుతం రూ.14.40 కోట్లకు పెరిగింది. అలాగే లక్మాపూర్ బ్రిడ్జి అసంపూర్తిగా ఉంది. జిల్లా కేంద్రం నుంచి ఉట్నూర్ ఆర్‌అండ్‌బీ రహదారి గుంతలమయంగా మారింది. రీ బీటీ చేయాలని ప్రతిపాదనలు పంపుతున్నా నిధులు కేటాయించడం లేదు.


పేరుకే ఆస్పత్రి అప్‌గ్రేడ్



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి

జిల్లా కేంద్రంలో నూతన ప్రభుత్వ వైద్యకళాశాల ఏర్పాటు చేయడంతో స్థానిక 50 పడకల ఆస్పత్రిని 330 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు. అయినా వసతులు మెరుగుపడటం పడకపోవడంతో ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలందడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేట్‌కే వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా గైనకాలజిస్టు లేకపోవడం సిజేరియన్ కాన్పులు జరగడం లేదు. ఈ నెల 9న ఆసిఫాబాద్ మండలానికి చెందిన ఓ గర్భిణిని మంచిర్యాలకు రెఫర్ చేయగా.. 108 వాహనంలో తరలిస్తుండగానే మార్గమధ్యలో కవలలకు జన్మనిచ్చింది. ప్రభుత్వ ఆస్పత్రి కేవలం రెఫరల్ కేంద్రంగా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకం జరగలేదు. కాంట్రాక్టు వైద్యులతో కాలం వెళ్లదీస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.

నిధులు కేటాయిస్తేనే.. సాగునీరు



కుమురంభీం ప్రాజెక్టు

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు లేకపోవడంతో అలంకారప్రాయంగా మారాయి. జగన్నాథ్‌పూర్, కుమురంభీం(అడ) ప్రాజెక్టుల నిర్మాణ పనులన్నీ పూర్తి కావడానికి సుమారు రూ.250 కోట్లు అవసరమవుతాయని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. గత బడ్జెట్‌లో కాంగ్రెస్ సర్కారు కుమురంభీం ప్రాజెక్టుకు రూ.7.95 కోట్లు, జగన్నాథపూర్ ప్రాజెక్టుకు రూ.12.32 కోట్లు, వట్టివాగు ప్రాజెక్టుకు రూ.2.59 కోట్లు, ఎన్టీఆర్ సాగర్ ప్రాజెక్టుకు రూ.15.60 లక్షలు, పీపీరావు సాగర్‌కు రూ.2.34 కోట్లు కేటాయించింది. ఇందులో చాలా వరకు నిధులు ఖర్చు చేయలేదని తెలుస్తోంది.

- అడ ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా 53 వేల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. కాల్వలు అసంపూర్తిగా ఉండటంతో కనీసం 10వేల ఎకరాలకు కూడా సాగునీరందడం లేదు. ప్రాజెక్టు కట్ట బీటలు తేలి మూడేళ్లవుతున్నా ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతులకు నోచుకోలేదు. ఇటీవల హైదరాబాద్ నుంచి ఇరిగేషన్ ఈఎన్‌సీ ప్రాజెక్టు సందర్శించి కాంక్రీట్ పోర్షన్ కట్టాలని సూచించారు. మరమ్మతులకు సుమారు రూ.30 కోట్లు అవసరం ఉంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు.
- ఆసిఫాబాద్ మండలంలోని వట్టివాగు ప్రాజెక్టు ఆధునికీకరణ కోసం ఆరేళ్లక్రితం రూ.27.76 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయినా నిధులు కేటాయించలేదు. కుమురంభీం ప్రాజెక్టు నిర్వహణకు ఏటా రూ.20 లక్షలు, వట్టివాగు ప్రాజెక్టు నిర్వహణకు ఏటా రూ.6 లక్షలు మాత్రమే మంజూరు చేస్తున్నారు.
- 20 ఏళ్లక్రితం ప్రారంభించిన జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు పరిస్థితి ఎక్కడ వేసినగొంగళి అక్కడే ఉంది. ప్రాజెక్టులో ముంపునకు గురైన రైతులకు నేటికీ నష్టపరిహారం అందలేదు. నిధులు కేటాయించక పోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. రాష్ట్రంలోనే నత్తనడకన సాగుతున్న ప్రాజెక్టుల్లో ఇది ఒక్కటి.

ముందడుగు పడేనా..!

16 ఏళ్లుగా ఈ ప్రాంత రైతులు సాగునీటికి ఎదురుచూస్తున్నారు. ప్రాణహిత నదిపై ప్రాజెక్టు నిర్మిస్తే భూములు సస్యశ్యామలంగా మారుతాయని నిరీక్షిస్తున్న వారి ఆశలు అడియాసలుగానే మిగిలిపోతున్నాయి. స్వరాష్ట్రంలోనూ ప్రాజెక్టుపై చిన్నచూపు తప్ప లేదు. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత స్థానికుల్లో ఆశలు చిగురించాయి. బుధవారం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ముందడుగు పడుతుందని ఆశాభావంతో ఉన్నారు.

- ప్రాణహిత ప్రాజెక్టు నిర్మిస్తామని రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి ప్రకటన
- ఈ వేసవిలో పనులు ప్రారంభిస్తామని వెల్లడి
- గత బడ్జెట్‌లో రూ.248.99 కోట్లు కేటాయింపు
- ఈసారి బడ్జెట్‌పై స్థానిక రైతుల ఆశలు



తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది

కౌటాల(సిర్పూర్): జిల్లాలో పెన్‌గంగ, వార్ధా, ప్రాణహిత నదులున్నా.. సాగుకు మాత్రం చుక్క నీరందని దుస్థితి ఉంది. వర్షాధారంగానే 90 శాతం భూముల్లో పంటలు సాగు చేస్తున్నారు. కాలంతో సంబంధం లేకుండా నిత్యం నదులు జలకళతో ఉంటున్నా భారీ ప్రాజెక్టులు నిర్మించలేదు. 20 ఏళ్ల క్రితం అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్దగల ప్రాణహిత నదిపై ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. అయితే గత ప్రభుత్వాలు పనులు చేపట్టలేదు. 16 ఏళ్ల అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ప్రాణహిత నిర్మిస్తామని ప్రకటించింది. కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై ప్రాజెక్టు నిర్మాణ పనులను ఈ వేసవిలో ప్రారంభిస్తామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ కోదండరాం అడిగిన ప్రశ్నకు ఈ విధంగా ఆయన సమాధానమిచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన డిజైన్‌లోనే ప్రాజెక్టు నిర్మిస్తామని ప్రకటించారు. ఏప్రిల్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌తో చర్చిస్తామని పేర్కొన్నారు.

2008లో శంకుస్థాపన

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జలయజ్ఞంలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్ట్ రూపుదిద్దుకుంది. పారిశ్రామిక, వ్యవసాయ రంగాలకు నీరందించడమే లక్ష్యంగా అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తుమ్మిడిహెట్టి వద్ద 2008 డిసెంబర్ 16న శంకుస్థాపన చేశారు. ప్రత్యేక రాష్ట్రంలో గత ప్రభుత్వం రీడిజైనింగ్ పేరుతో ప్రాజెక్ట్‌ను కాళేశ్వరానికి తరలించింది. కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచీ తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత ప్రాజెక్టు నిర్మిస్తామని ప్రకటిస్తున్నా ఇప్పటివరకు భారీ స్థాయిలో నిధులు కేటాయించలేదు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో ఎంత మేరకు ప్రాధాన్యత ఇస్తారో.. ఏ మేరకు నిధులు కేటాయిస్తారో.. అనే చర్చ స్థానిక రైతుల్లో సాగుతోంది. గత బడ్జెట్‌లో ప్రాణహిత– చేవెళ్ల ఎత్తిపోతల ప్రాజెక్టుకు కేవలం రూ.248.99 కోట్ల నిధులు కేటాయించారు. కానీ ప్రాజెక్టుకు సంబంధించిన పనుల్లో ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదు. ప్రాజెక్టు నిర్మిస్తే దాదాపుగా 2 లక్షల ఎకరాల వరకు సాగునీరు అందనుంది.

పనులెప్పుడు ప్రారంభిస్తారు..?



ఈ వేసవిలో ప్రాణహిత ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినా ఇప్పటివరకు ఎలాంటి కదలిక లేదు. పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో స్పష్టతనివ్వాలి. ప్రాణహిత ప్రాజెక్టు కాలువల్లో భూములు కోల్పోయిన రైతులు సాగునీటి కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. అరకొరగా నిధులు కేటాయిస్తే ఈ ప్రాంతానికి తీరని అన్యాయం చేసినట్లే..

– దోని శ్రీశైలం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

నిధులు కేటాయించాలి



ప్రజా సమస్యలతో పాటు ప్రాణహిత ప్రాజెక్టుపై అసెంబ్లీలో ప్రశ్నిస్తాను. 35 సమస్యలతో నివేదిక సిద్ధం చేశా. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణానికి ముందుకొస్తే కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు కేటాయించేందుకు సిద్ధంగా ఉంది. బడ్జెట్‌లో ప్రాణహిత ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయించాలి. రాష్ట్ర ప్రభుత్వం కాలక్షేపం చేయకుండా పనులు ప్రారంభించాలి.

– పాల్వాయి హరీశ్‌బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే

న్యూస్‌రీల్

‘అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు’

దహెగాం(సిర్పూర్): వాగులు, ఒర్రెల నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ దహెగాం మండలంలో ఇసుక, మట్టి అక్రమ రవాణాపై ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. పోలీసులు, అధికారులు దృష్టి సారించి రవాణాను అరికట్టాలని ఆదేశించారు. రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. అనుమతి లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే ట్రాక్టర్లు సీజ్ చేసి కేసు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత తదితరులు ఉన్నారు.

అర్హత పోటీలకు బయల్దేరిన జిల్లా విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: హైదరాబాద్‌లోని వాటర్ స్పోర్ట్స్ అకాడమీ స్కూల్ అర్హత పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా నుంచి 18 మంది బాలబాలికలను ఎంపిక చేసినట్లు డీటీడీవో రమాదేవి, డీఎస్‌వో మీనారెడ్డి తెలిపారు. విద్యార్థులు మంగళవారం ప్రత్యేక వాహనంలో హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. మార్చి 19న హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి వాటర్ స్పోర్ట్స్ అకాడమీ స్కూల్‌లో అర్హత క్రీడాపోటీలు ఉంటాయని డీటీడీవో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించే అర్హత పోటీలకు జిల్లా నుంచి 11 మంది బాలురు, ఏడుగురు బాలికలను పంపించామని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన వారు వాటర్ స్పోర్ట్స్ అకాడమీకి ఎంపికవుతారని తెలిపారు. కార్యక్రమంలో కోచ్‌లు విద్యాసాగర్, అరవింద్, హెచ్‌ఎం జంగు, వార్డెన్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణలో అలసత్వం వద్దు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మొక్కలు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్: నర్సరీల్లో పెంచుతున్న మొక్కల సంరక్షణలో సిబ్బంది అలసత్వం ప్రదర్శించొద్దని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండలంలోని బూర్గుడ గ్రామ పంచాయతీలోని నర్సరీని మంగళవారం పరిశీలించారు. పంచాయతీ నిర్వహణ రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో మొక్కల పెంపకంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ నీటిని అందించాలన్నారు. విత్తనాలు మొలకెత్తకపోవడంతో రెండు రోజుల్లో నివేదిక అందించాలని ఏపీవోను ఆదేశించారు. అనంతరం గ్రామ పంచాయతీ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం 25 శాతం రాయితీ ప్రకటించిందని తెలిపారు. పంచాయతీలో 78 మంది దరఖాస్తుదారుల్లో కేవలం ముగ్గురు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా నగదు చెల్లించారని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో ఉమర్, ఎంపీవో మౌనిక, ఏపీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి శ్రీలత, కారోబార్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్‌లపై పటిష్ట నిఘా

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో బెట్టింగ్‌లపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోసపూరిత ప్రకటనలు నమ్మొద్దని, సోషల్ మీడియాలో ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌లను ప్రోత్సహించే వారి సమాచారాన్ని పోలీసుశాఖకు అందించాలని సూచించారు. యువత, విద్యార్థులు బెట్టింగ్, గేమింగ్ యాప్‌లకు అలవాటుపడి అప్పుల పాలవుతున్నారని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేసేవారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇలాంటి కార్యకలాపాలపై ప్రజలు డయల్ 100, స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోషల్ మీడియాలో గ్రూపులు నిర్వహించే అడ్మిన్లు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆన్‌లైన్ బెట్టింగ్, గేమ్స్‌తో కలిగే అనర్థాల గురించి అవగాహన కల్పిస్తామని తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎండీ బషిరుద్దీన్ కుటుంబ సభ్యులకు ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మంగళవారం జిల్లా కేంద్రంలో రూ.2,20,000 విలువైన చెక్కు అందించారు. ఈజ్‌గాం పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వర్తించే ఎండీ బషిరుద్దీన్ గతేడాది నవంబర్ 17న మృతి చెందారు. కోఆపరేటివ్ సొసైటీ ద్వారా మంజూరైన చెక్కును కుటుంబ సభ్యులకు అందించారు. బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటామని ఎస్పీ తెలిపారు.

బాధితులకు సత్వర సహాయం అందించాలి



వివరాలు తెలుసుకుంటున్న మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి

ఆసిఫాబాద్‌అర్బన్: సఖి కేంద్రానికి వచ్చే బాధితులకు సత్వర సహాయం అందించేందుకు నిర్వాహకులు కృషి చేయాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి అన్నారు. జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించి, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సఖి కేంద్రం ద్వారా మహిళలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ సఖి కేంద్రం ద్వారా అందుతున్న సేవలపై ప్రతీ మండలంలో అవగాహన కల్పించాలన్నారు. బాధిత మహిళల రక్షణ, వారి సమస్యల పరిష్కారం కోసం నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం సిబ్బందిని ఈశ్వరీబాయిని శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీసీడీవో శకుంతల, సిబ్బంది మమత, సుమలత, రమేశ్, సత్యశీల తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన 48 గంటల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఆసిఫాబాద్: గతంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహిస్తున్న 48 గంటల ధర్నా కార్యక్రమం మంగళవారం ముగిసింది. సీఐటీయూ జిల్లా నాయకులు మాట్ల రాజు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్లకు ప్రతినెలా వేతనాలు 1వ తేదీనే చెల్లించాలని, గ్రాట్యుటీ వర్తింపజేసి ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపర్చిన రూ.18 వేల వేతనం, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, మినీ అంగన్‌వాడీ టీచర్లు 10 నెలల బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం ప్రతి ని ధులు త్రివేణి, గంగామణి, అరుణ, స్వరూ ప, రాజేశ్వరి, కమల, అంజలి, మల్లేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఎం



కలెక్టర్‌తో ఆర్టీసీ డీఎం రాజశేఖర్

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కేవీ రాజశేఖర్ మంగళవారం కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఎస్పీ డీవీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా రవాణాశాఖ అధికారి రాంచందర్‌ను కలిశారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్: బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం శాసనసభలో జీరో అవర్‌లో ఆసిఫాబాద్ నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడారు. ఆసిఫాబాద్ మండలంలోని గుండి వాగుపై వంతెన పనులు కొన్నేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయని, జాప్యంతో అంచనాలు పెరిగాయని తెలిపారు. రానున్న వర్షాకాలం ప్రారంభం నాటికి బ్రిడ్జి పనులు పూర్తయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కెరమెరి మండలం లక్మాపూర్ వంతెన పూర్తి చేయడంతో పాటు, ఆదిలాబాద్‌కు వెళ్లే ప్రధాన రహదారిని విస్తరించాలని అన్నారు.

రంగనాయక ఆలయానికి నిధులు కేటాయించాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

కౌటాల/బెజ్జూర్: రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం తెలంగాణ ధార్మిక, ధర్మాదాయ బిల్లుపై సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు మాట్లాడారు. బెజ్జూర్ మండల కేంద్రంలోని అతిపురాతన రంగనాయక ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. శేష పాన్పుపై నిద్రిస్తున్న శ్రీరంగనాయక స్వామి విగ్రహం మహా అద్భుతంగా ఉంటుందని తెలిపారు. ఈజ్‌గాం శివమల్లన్న ఆలయ కమిటీలో స్థానికులకు అవకాశం కల్పించాలన్నారు. బాసర ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే ఆరోగ్య శ్రీ బకాయిలు ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, కాళేశ్వరం జోన్‌లో కొత్త సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించాలని ఆయన కోరారు.

భగీరథ పైపులైన్ పునరుద్ధరణ

- నెల రోజుల తర్వాత 64 గ్రామాలకు తాగునీరు

సాక్షి ఎఫెక్ట్



పునరుద్ధరణ పనులు చేపడుతున్న సిబ్బంది

దహెగాం(సిర్పూర్): కాగజ్‌నగర్ మండలం అందవెల్లి సమీపంలోని పెద్దవాగు వంతెన వద్ద అధికారులు ఎట్టకేలకు మిషన్ భగీరథ పైపులైన్ పునరుద్ధరించారు. దాదాపు నెల రోజుల తర్వాత 64 గ్రామాలకు తాగునీటి సరఫరాకు మార్గం సుగమమైంది. అందవెల్లి పెద్దవాగు వంతెన అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు నెల రోజుల క్రితం ప్రారంభించారు. ఈ క్రమంలో వంతెన పైనుంచి ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పైప్‌లైన్ తొలగించారు. దహెగాం, కాగజ్‌నగర్, భీమిని, కన్నెపల్లి మండలాల్లోని 64 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ప్రజలు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 14న ‘సాక్షి’లో ‘నెల రోజులుగా భగీరథ బంద్, మళ్లీ ఈ నెల 16న ‘మిషన్ భగీరథ నీళ్లు వచ్చేదెప్పుడు..?’ అంటూ వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఎట్టకేలకు మిషన్ భగీరథ అధికారులు స్పందించారు. మంగళవారం పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి పూర్తి చేశారు. రాత్రి వరకు భగీరథ తాగునీటి సరఫరాను పునరుద్ధరించామని ఏఈ సాయికృష్ణ తెలిపారు.

క్లుప్తంగా

దాడి చేసిన వ్యక్తిపై కేసు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని వడ్డెర కాలనికి చెందిన కొత్తగట్టు శ్రీనివాస్‌పై దాడి చేసిన శ్రీరాముల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. కొత్తగట్టు పద్మ, శ్రీరాముల శ్రీనివాస్ వరుసకు అక్కా,తమ్ముడు అవుతారు. ఇద్దరికీ కలిసి ఏసీసీ సమీపంలో ఒక ఇళ్లు ఉంది. పద్మకు తెలియకుండా గోడ నిర్మాణం చేశాడు. దీనికి అయిన ఖర్చులో సగం ఇవ్వాలని ఈ నెల11న శ్రీనివాస్ పద్మపై దాడి చేసేందుకు యత్నించగా అడ్డుకున్న ఆమె భర్త శ్రీనివాస్‌పై కుర్చీతో దాడి చేసి గాయపరిచాడు. మంగళవారం పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శ్రీరాముల శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు

మంచిర్యాలక్రైం: చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్షతో పాటు అప్పుగా తీసుకున్న రూ.12 లక్షలు చెల్లించాలని జూనియర్ సివిల్ కోర్టు జడ్జి, ఫస్ట్‌క్లాస్ జుడీషియల్ మేజిస్ట్రేట్ కే.నిరోష మంగళవారం తీర్పునిచ్చారు. మంచిర్యాలకు చెందిన గుమ్మి జగన్నాథ్‌రెడ్డి వద్ద స్థానిక రెడ్డికాలనీకి చెందిన తోట రామకృష్ణారెడ్డి తన అవసరం నిమిత్తం రూ.12 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ సమయంలో ష్యూరిటీగా చెక్కు అందజేశాడు. అప్పు తీసుకున్న గడువు తీరిన తర్వాత సదరు చెక్కును బ్యాంకులో డిపాజిట్ చేయగా బౌన్స్ అయ్యింది. దీంతో 2017లో జగన్నాథ్‌రెడ్డి కోర్టును ఆశ్రయించగా విచారణ అనంతరం న్యాయమూర్తి నిరోష ఏడాది జైలుశిక్షతో పాటు తీసుకున్న అప్పు చెల్లించాలని తీర్పునిచ్చారు.

చోరీ కేసులో ఒకరికి జైలుశిక్ష

లక్సెట్టిపేట: చోరీ కేసులో ఒకరికి మూడు నెలల తొమ్మిది రోజుల సాధారణ జైలుశిక్ష విధించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన గంగాధర్ విట్టల్ గైక్వాడ్ 2024 అక్టోబర్ 27న పట్టణంలోని ఆంధ్రాకాలనీలోని రెండిళ్లలో చోరీకి పాల్పడ్డాడు. ఇళ్ల తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ.50వేల నగదు, ఇత్తడి సామగ్రి దొంగిలించాడు. బాధిత మహిళ లక్ష్మి ఫిర్యాదు మేరకు అదనపు ఎస్సై రామయ్య కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా నేరం రుజువు కావడంతో స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ మంగళవారం పైవిధంగా తీర్పునిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు




గాయాలపాలైన ఖాదీర్, సత్యనారాయణ

లక్ష్మణచాంద: రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలైన సంఘటన మండలంలోని కనకాపూర్ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఖాదీర్, కుభీర్ మండలానికి చెందిన సత్యనారాయణ మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై ఖానాపూర్ వైపు నుండి నిర్మల్ వెళ్తుండగా నిర్మల్ నుండి కనకాపూర్ వైపు వస్తున్న ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఘటనలో ఖాదీర్, సత్యనారాయణకు తీవ్ర గాయాలు కావడంతో నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు.

పిచ్చుకలతో జీవ వైవిధ్యం

- రేపు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం





యోగేశ్వర్ ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన పిచ్చుక గూళ్లు

నస్పూర్: పిచ్చుకల సంరక్షణతోనే జీవ వైవిధ్యం కొనసాగుతుందని నేటి ఆధునిక సమాజంలో ఎంత మందికి తెలుసు. ఈ భూగోళంపై నివసించే ప్రతీ జీవి, మానవునితో పాటు సకల ప్రాణుల మనుగడకు, జీవవైవిధ్యానికి, ఆహార ఉత్పతికి సైతం పిచ్చుకల పరపరాగ సంపర్కమే కారణం. కనుమరుగవుతున్న కమనీయ పిచ్చుకల జాతులను కాపాడుకోకుంటే తీరని నష్టం వాటిల్లుతుందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. పంట చేలల్లో, పల్లె ముంగిట్లో ధాన్యపు రాశుల్లో కిలకిల మంటూ సందడి చేసే పిచ్చుకలు మానవుడు పెంచుకుంటున్న సాంకేతిక పరిజ్ఞానంతో వాటి మనుగడకు శాపంగా మారిందని సెల్ తరంగాల రేడియేషన్, కాలుష్యం కారణంగా ఇవి ప్రకృతి నుండి కనుమరుగవుతున్నాయని పర్యావరణ వేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తల్లి ప్రేమకు నిదర్శనం

జనావాసాలతో మమేకమై జీవిస్తున్న పిచ్చుకలు మెత్తని పీచు వంటి వాటితో గూడు కట్టుకోవడం, అందులో గుడ్లు పెట్టడం, వాటిపై పొదగడం, పుట్టిన పిల్లలకు ఆహారాన్ని నోటితో తెచ్చి అందించడం, వాటికి రెక్కలొచ్చి ఎగిరేంత వరకు జాగ్రత్తగా కాపాడడం వంటి దృశ్యాలు తల్లి ప్రేమకు నిదర్శనంగా నిలుస్తాయనడంలో అతిశయోక్తి లేదు.

మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

ఆదర్శవంతమైన పిచ్చుకల అన్యోన్యతను, తల్లి ప్రేమకు మరోపేరుగా గుర్తించిన ప్రపంచ దేశాలు పిచ్చుకల సంరక్షణపై అవగాహన కల్పించడానికి ప్రతీ సంవత్సరం మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నాయి. పిచ్చుకల ప్రాధాన్యతను గుర్తించిన భారత ప్రభుత్వం తపాలా బిల్లును సైతం విడుదల చేసిందని పర్యావరణ వేత్తలు గుర్తు చేస్తున్నారు.

పిచ్చుకలను బతుకనిద్దాం

పిచ్చుకల మనుగడకు ప్రమాదం ఏర్పడితే మానవ మనుగడపై తీవ్ర ప్రమాదం ఏర్పడుతుంది. పిచ్చుకల సంరక్షణ ప్రతీఒక్కరి బాధ్యత. వాటి ఆవాసం కోసం ఇంటి ఆవరణలో వెదురు, కర్ర, అట్టడబ్బాలతో గూళ్లు తయారు చేయాలి. మట్టిపాత్రలో నీరు, ధాన్యపు గింజలు పోసి ఉంచాలి. ఇంటి ముందు రసాయనాలు లేని బియ్యపు పిండి ముగ్గు వేస్తే వాటికి ఆహారంగా ఉపయోగపడుతుంది. పిచ్చుకలు పదికాలాల పాటు పదిలంగా బతికేలా మానవులుగా మనవంతుగా సహకరిద్దాం.. పిచ్చుకలను బతుకనిద్దాం. పర్యావరణాన్ని కాపాడుదాం.

– గుండేటి యోగేశ్వర్, పర్యావరణ వేత్త, రిటైర్డ్ టీచర్, నస్పూర్

కొలిక్కిరాని హమాలీల వివాదం

- రెండో రోజూ జైనథ్‌లో నిలిచిన శనగ కొనుగోళ్లు



మార్కెట్ యార్డులో ఆందోళనకు దిగిన రైతులు

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో హమాలీల వివాదం ఎటూ తేలలేదు. రెండోరోజు మార్కెట్ యార్డులో శనగ కొనుగోళ్లు జరగలేదు. బుధవారం సైతం ప్రారంభమయ్యేలా కన్పించడం లేదు. ఇద్దరు గుత్తేదారుల మధ్య నెలకొన్న లొల్లి రైతుల పాలిట శాపంగా మారింది. ఆందోళనను సద్దుమణిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యామలదేవి ముగ్గురు అధికారులతో కూడిన బృందాన్ని జైనథ్ మార్కెట్‌యార్డుకు పంపించింది. సదరు అధికారులు దీనిపై ఎటూ తేల్చకుండానే వెనుదిరిగారు. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా వారు ఎవరికి ఏమి చెప్పే పరిస్థితి లేకపోవడంతో చేసేదేమి లేక ఉన్నతాధికారుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్తామని అక్కడి నుంచి వెనుదిరిగారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని మార్కెటింగ్ ఏడీ గజానంద్, మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి, డీసీవో మోహన్‌లు మార్కెట్ కార్యదర్శి దేవన్నకు సూచించారు. అక్కడున్న కాంటాల్లో ఇద్దరు గుత్తేదారులకు చెరిసగం చూసుకోవాలని సూచించినట్లుగా తెలుస్తోంది. అయితే సదరు గుత్తేదార్లు దీనిపై అంగీకరించేందుకు ముందుకు రాలేదు. జైనథ్ వ్యవసాయ మార్కెట్ అధికారులు కొత్త గుత్తేదారుకు లైసెన్స్ ఇచ్చినట్లుగా సమాచారం. ఆయనకే హమాలీల బాధ్యతలను పూర్తిస్థాయిలో కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. అయితే గత 15ఏళ్లుగా బిహార్‌కు చెందిన గుత్తేదారే హమాలీలను సరఫరా చేస్తున్నారు. తాను ఎలాంటి తప్పు చేయకున్నా ఉన్నఫలంగా తనను ఏ విధంగా తొలగిస్తారని వాపోతున్నారు. ఇద్దరు గుత్తేదార్లను పిలిచి నచ్చజెప్పినప్పటికి వారి మధ్య సయోధ్య కుదరలేదు. శనగ పంటను విక్రయించేందుకు తీసుకొచ్చిన రైతులు కొనుగోళ్లు చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాలీ కాంట్రాక్టర్ల లొల్లి కారణంగా తమను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రైతులు పేర్కొన్నారు.

నా బిడ్డను మా అమ్మకు అప్పగించండి..!

- నా చావుకు భార్య, అత్తమామలే కారణం
- సెల్ఫీ వీడియోలో వెల్లడి
- యువకుడి ఆత్మహత్య



అంజన్న (ఫైల్)

దండేపల్లి: 'నా చావుకు భార్య, అత్తమామలే కారణం.. నా బిడ్డను మా అమ్మకు అప్పగించండి..' అంటూ ఓ యువకుడు సెల్ఫీ వీడియోలో పేర్కొంటూ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని వెల్గనూర్ గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కాంద్రపు అంజన్న(26) కాసిపేటకు చెందిన శిరీషను రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి వారం రోజుల క్రితం కూతురు జన్మించింది. దీంతో సోమవారం కూతురిని చూడడానికి అంజన్న కాసిపేటకు వెళ్లగా.. భార్య, అత్తమామలు దూషించారు. దీంతో ఆవేదనకు గురైన అంజన్న ఇంటికి వచ్చి సెల్ఫీ వీడియో తీసుకుంటూ తన ఆత్మహత్యకు కారకులు అంటూ భార్య, అత్తమామలు, పెద్దమనుషులు పలువురి పేర్లు పేర్కొన్నాడు. రాత్రి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి భీమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య



రాకేశ్ (ఫైల్)

జైపూర్: ఖాళీగా ఉండకుండా ఏదైనా పని చేసుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మంచిర్యాల జిల్లాలోని శివ్వారంలో చోటు చేసుకుంది. ఎస్సై నాగరాజు తెలిపిన వివరాల మేరకు శివ్వారం గ్రామానికి చెందిన గెల్లు పోశక్క, దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పెద్ద కుమారుడు రాకేశ్ (26) డిగ్రీ పూర్తి చేశాడు. కొంతకాలం ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేసి మానేశాడు. కొద్దిరోజులుగా ఇంటివద్దే ఉంటున్నాడు. దీంతో అతని తల్లిదండ్రులు ఏదైనా పని చేసుకోవాలని, లేదా వ్యవసాయం చూసుకోవాలని చెప్పడంతో మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం పంట పొలం వద్దకు వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కర్బూజ సాగు..లాభాలు బాగు

- జిల్లా వ్యాప్తంగా 70 ఎకరాల్లో సాగు
- అధిక దిగుబడులు సాధిస్తున్న రైతులు
- వేసవిలో పంటకు డిమాండ్



ఒతుకులపల్లిలో సాగుచేసిన కర్బూజ పంట

చెన్నూర్‌రూరల్: పంట మార్పిడి విధానం అవలంభిస్తే అధిక లాభాలు ఉంటాయి. ఎల్లప్పుడూ ఒకే రకం పంటలు సాగుచేస్తే భూసారం దెబ్బతింటుంది. వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు రైతులు పంట మార్పిడికి ముందుకు వస్తున్నారు. ఇందుకు ఉదాహరణ కర్బూజ సాగు. ఇతర పంటలు సాగు చేసి విసిగి పోయిన కొందరు రైతులు ఇందుకు భిన్నంగా ఆలోచించి వేసవిలో కర్బూజ సాగు వైపు దృష్టి సారించారు. వేసవిలో మార్కెట్‌లో కర్బూజకు మంచి డిమాండ్ ఉంటుంది. దీంతో ఈ పంట వైపు దృష్టి పెట్టారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 70 ఎకరాల్లో కర్బూజ పంట సాగవుతోంది. జిల్లాలోని చెన్నూర్, భీమారం, బెల్లంపల్లి, దండేపల్లి, కోటపల్లి, వేమనపల్లి, భీమిని, కన్నెపల్లి మండలాల్లో పంట సాగు చేస్తున్నారు. ఎకరాకు సుమారు రూ.20 వేల నుండి రూ.25 వేల వరకు పెట్టుబడులు అవుతాయి. నవంబర్, డిసెంబర్ నెలలు సాగుకు అనుకూలం. గింజలు నాటిన సమయం నుంచి మూడు నెలల వరకు పంట కాపుకు వస్తుంది. ఎకరాకు సుమారు 12 నుంచి 15 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. కిలోకు రూ.12 నుండి 15వరకు ధర పలుకుతుంది. ఎకరానికి సుమారు రూ.60 వేల నుంచి 70వేల వరకు లాభం వస్తుంది. స్వయంగా అమ్మితే లాభం మరింత ఎక్కువగా ఉంటుంది.

చీడపీడల నివారణకు చర్యలు

ఈ పంటను కాయ తొలుచు పురుగు (పండు ఈగ) ఎక్కువగా ఆశిస్తుంది. దీని యొక్క లార్వాలు కాయలోకి చొచ్చుకు పోయి కుళ్లి పోయేలా చేస్తాయి. పురుగు ఆశించక ముందే 10 లీటర్ల నీటిలో 100 ఎంఎల్ మలాథియన్, 100 గ్రాముల బెల్లం కలిపి వెడల్పాటి పళ్లెంలో ఈ ద్రావణం పోసి పంట చేనులో అక్కడక్కడ ఉంచాలి. పురుగు ఆశించిన తర్వాత నివారణకు వెంటనే లీటరు నీటికి 2ఎంఎంల్ మలాథియన్ లేదా 2 ఎంఎల్ క్లోరిపైరిపాస్ పిచికారీ చేయాలి. అలాగే తెల్లదోమ నివారణకు జిగురు కలిగిన పసుపు రంగు అట్టలను చేనులో ఏర్పాటు చేసుకోవాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 3ఎంఎల్ ఇమిడాక్లోప్రిడ్ లేదా 2 గ్రాముల ఎస్టమిప్రైడ్ కలిపి పిచికారీ చేయాలి. తామర పురుగు ఆశిస్తే లీటరు నీటికి 2 గ్రాముల పిప్రోనిల్ కలిపి పిచికారీ చేయాలి.

మంచి లాభాలు ఉన్నాయి



వరి, పత్తి పంటల సాగుకు భిన్నంగా వేరే రకం పంటలు సాగు చేయాలని అనుకున్నా. మూడేళ్లుగా రెండెకరాల భూమిలో కర్బూజ సాగు చేస్తున్నా. మంచి లాభాలు ఉన్నాయి. వేసవిలో పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

– కంకణాల లక్ష్మణ్‌రెడ్డి, కర్బూజ రైతు, ఒతుకులపల్లి

సలహాలు, సూచనలు ఇస్తున్నాం



కర్బూజ సాగులో మంచి లాభాలు ఉన్నాయి. రైతులు ముందుకు వచ్చి ఇలాంటి పంటలు సాగు చేసి అధిక లాభాలు గడించాలి. నియోజకవర్గ వ్యాప్తంగా కర్బూజ సాగు చేస్తున్న రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం.

– బానోతు ప్రసాద్, ఏడీఏ, చెన్నూర్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



కరణ్‌సింగ్ (ఫైల్)

నిర్మల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్‌నగర్ కాలనీకి చెందిన చవాన్ కరణ్‌సింగ్ (22) మంగళవారం అదే కాలనీకి చెందిన స్నేహితులు సయ్యద్ అజీమ్, నర్సింగ్‌తో కలిసి బైక్‌పై సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) గ్రామానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో జిల్లా కేంద్రంలోని గండి రామన్న ఆలయ సమీపంలోకి రాగానే టిప్పర్‌ను ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో బైక్ అదుపుతప్పి ముగ్గురూ కిందపడిపోయారు. కరణ్‌సింగ్ తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సయ్యద్ అజీమ్, నర్సింగ్‌ను 108లో ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

చేపల వల చుట్టుకుని మత్స్యకారుడు..



సాయికుమార్ మృతదేహం

సోన్: చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపి తెలిపిన వివరాల మేరకు మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన సస్కిన్ సాయికుమార్ (28) మంగళవారం వృత్తిరీత్యా చేపలు పట్టేందుకు సరస్వతి కెనాల్‌కు వెళ్లాడు. కాలువలో చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు వల కాళ్లకు చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

ఉట్నూర్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం జైనూర్ మండలానికి చెందిన కుమ్ర భిక్కు (46) మంగళవారం ఉట్నూర్ మండలంలోని దంతన్‌పల్లి సమీపంలో జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొన్నాడు. తిరుగు ప్రయాణంలో బైక్‌పై వస్తుండగా మారుతిగూడ సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన మరో బైక్‌ను ఢీకొట్టాడు. ఘటనలో భిక్కుకు తీవ్రగాయాలు కావడంతో అటుగా వెళ్తున్న మాజీ ఎంపీపీ గమనించి 108కు సమాచారం అందించగా ముందుగా ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఘటనపై పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు.

చికిత్స పొందుతూ మహిళ..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా కొఠారి గ్రామానికి చెందిన రాథోడ్ జాముబాయి (55) మృతి చెందినట్లు టూటౌన్ ఏఎస్సై ముకుంద్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భారీ వర్షాల కారణంగా పంటలు దెబ్బతినడంతో పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో ఈనెల 16న రాత్రి పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వివరించారు.

చోరీ కేసులో మహిళ రిమాండ్

లక్సెట్టిపేట: ఈనెల 16న పట్టణంలోని గోదావరి రోడ్‌లో నివాసముంటున్న కొత్త శ్యామల ఇంట్లో చోరీకి పాల్పడిన వసంత అనే మహిళను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. అదే కాలనీకి చెందిన వసంత బాధితురాలు శ్యామల ఇంట్లో ఎవరూలేని సమయంలో చొరబడి ఆమెను బాత్‌రూంలోకి నెట్టివేసి మెడలోని గొలుసు లాక్కుని పారిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి గొలుసును స్వాధీనం చేసుకున్నారు. సదరు మహిళను సోమవారం రాత్రి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



బియ్యం పరిశీలిస్తున్న ఎస్సై రాహుల్

ఖానాపూర్: పట్టణంలోని ఇంద్రానగర్ కాలనీలో కడమంచి లక్ష్మణ్ నివాసంలో అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. నిరుపేద ప్రజల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయించేందుకు ఇంటి వెనకాల ప్రహరీ వద్ద నిలువ ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

నేషనల్ మార్ట్‌లో చోరీ



సీసీ ఫుటేజీలో రికార్డయిన దృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని నేషనల్ మార్ట్‌లో చోరీ జరిగినట్లు ఎస్సై విష్ణు వర్ధన్ తెలిపారు. రోజు మాదిరిగానే నేషనల్ మార్ట్ సిబ్బంది సోమవారం రాత్రి తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం వచ్చేసరికి సేఫ్టీలాకర్ ఓపెన్ అయి ఉండడంతో మేనేజర్ తుకారాం పోలీసులకు సమాచారం అందించాడు. లాకర్‌లో ఉన్న రూ.4.82 లక్షలు చోరీకి గురయ్యాయని మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. సీసీ ఫుటేజీలో రికార్డయిన లాకర్ ఓపెన్ చేస్తున్న దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఐటీడీఏ పీవోకు స్కోచ్ అవార్డు



ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా గిరిజనులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా స్కోచ్ అవార్డుకు ఎంపికయ్యారు. విధుల్లో చేరినప్పటి నుంచి గిరిజనులకు చేరువ కావడంతో పాటు గిరిజన విద్యార్థుల్లో పౌష్టికాహార నివారణకు రాష్ట్రంలో మొదటిసారిగా గిరిజన పోషణ మిత్ర, స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు గిరిజన క్యాంటీన్‌ను ఏర్పాటు చేయడంలో పీవో ముందు వరుసలో నిలిచారు. ఈ నెల 29న న్యూఢిల్లీలో ఇండియా హబిటాట్ సెంటర్‌లోని జకరంద హాల్‌లో ఐటీడీఏ పీవో అవార్డు అందుకోనున్నారు.

గిన్నిస్ రికార్డులో స్థానం జిల్లాకే గర్వకారణం



గుస్సాడీ బృందంతో కుమురంభీం జిల్లా కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: ఆదివాసీ గిరిజనుల సంప్రదాయమైన గుస్సాడీ నృత్య ప్రదర్శన గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించుకోవడం జిల్లాకే గర్వకారణమని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తిర్యాణి మండలం దంతన్‌పల్లి గ్రామానికి చెందిన భీమయ్య కొలాం గుస్సాడీ బృందంతో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, గిరిజన సంఘాల నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వం సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఢిల్లీలో 5 వేల మంది కళాకారులతో నిర్వహించిన కార్యక్రమంలో దంతన్‌పల్లి పీవీటీజీ కొలాం గుస్సాడీ బృందం నృత్య ప్రదర్శన రికార్డు సృష్టించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్‌లో స్థానం సంపాదించిందన్నారు. గిరిజనుల ఆచారాలు, సంస్కృతి, సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాలన్నారు. అనంతరం గుస్సాడీ బృంద సభ్యులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు సిడాం అర్జు, ఆత్రం గంగారాం, మడావి భీమ్‌రావు, కుర్సింగ మోతీరాం, ఆత్రం సంతోశ్, చహకటి దసరు, తదితరులు పాల్గొన్నారు.

గనుల వేలంలో సింగరేణి పాల్గొనాలి



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

కాసిపేట: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న మోసపూరిత కుట్రను రద్దుచేసి సింగరేణి టెండర్లలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం మందమర్రి ఏరియా కాసిపేట గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ సత్తుపల్లి, ఇల్లందు మైన్‌లకు సింగరేణి టెండర్లలో పాల్గొనవద్దని బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెప్పడం జరిగిందన్నారు. తిరిగి అదే ప్రభుత్వం సింగరేణికి టెండర్ ఇవ్వకుండా ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సమ్మె చేసి హక్కులు సాధించుకుంటామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, గని ఫిట్ సెక్రెటరీ మినుగు లక్ష్మీనారాయణ, బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ వెంకటస్వామి, నాయకులు నాగేశ్వరరావు, శ్రీహరి, రాజేందర్, సురేశ్, సంతోశ్, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

22న ట్రిపుల్ ఐటీలో ఎస్‌డీజీ సమ్మిట్



లోగో ఆవిష్కరిస్తున్న వీసీ గోవర్ధన్

బాసర: నిర్మల్ జిల్లా బాసరలోని ఆర్జీయూకేటీ (ట్రిపుల్ ఐటీ)లో ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలలో భాగంగా ఈనెల 22న ఎస్‌డీజీ సమ్మిట్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ తెలిపారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి ఆవిష్కరణలు, భాగస్వామ్యాలు, కార్యాచరణ పరిష్కారాలను పెంపొందించడం లక్ష్యంగా ఈ సమ్మిట్ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వర్సిటీ విద్యార్థి జావేద్ నేతృత్వంలోని టీమ్ ట్రాన్స్‌ఫార్మ్ ఈ సమ్మిట్ నిర్వహిస్తుందన్నారు. ప్రపంచ సవాళ్లను పరిష్కరించడానికి సహకారం, వినూత్న పరిష్కారాల ప్రాముఖ్యతను ప్రొఫెసర్ గోవర్ధన్ నొక్కి చెప్పారు. ఈ సమ్మిట్ థీమ్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజల జీవితాల్లో అర్థవంతమైన మార్పు తీసుకురావడానికి సంస్థ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. అనంతరం సమ్మిట్ లోగోను విడుదల చేశారు. ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీ దర్శన్, ఏవో రణధీర్ సాగి పాల్గొన్నారు.